ప్రజల చేతిలో

www.ayudamdaily.com

# ఆయుధం

The Common People's Voice

గురువారం | జూన్ 11, 2026 | సంపుటి : 7 | సంచిక : 12 | పేజీలు : 2

## ప్రజల భాగస్వామ్యంతో రోడ్డు ప్రమాదాల నియంత్రణ సాధ్యం

- ఆపరేషన్స్ డీజీపీ అనిల్ కుమార్
- జనగామలో అరైవ్ అలైవ్ కార్యక్రమం

2 లో





## కాంగ్రెస్‌లో టీఎంసీ విలీనం?

- రాహుల్‌తో టీఎంసీ ఎంపీల భేటీ



**జాతీయం, ఆయుధం:** ఎమ్మెల్యేలు, ఎంపీలు వరుసగా పార్టీని వీడుతుండడంతో టీఎంసీ... రాజకీయ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. దీంతో టీఎంసీని కాంగ్రెస్‌లో విలీనం చేయడం కోసం ఇటీవల జరిగిన ఇండియా కూటమి సమావేశంలో ఇరుపార్టీల నేతలు చర్చించినట్టు వార్తలు వస్తున్నాయి. అయితే ఈ ప్రచారాలను పార్టీ నేతలు కొట్టిపడేశారు. కాగా ప్రస్తుతం మమతా బెనర్జీతో ఉన్న టీఎంసీ ఎంపీలు అభిషేక్ బెనర్జీ నేతృత్వంలో నేడు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో రహస్యంగా సమావేశమయ్యారు. దీంతో కాంగ్రెస్‌లో టీఎంసీ విలీనం కానుందనే వార్తలకు బలం చేకూరినట్లైంది. కాగా కాంగ్రెస్‌లో విలీనానికి టీఎంసీ నేతలే మొదట ప్రతిపాదన తెచ్చారని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి.

సొంత పార్టీ నేతల నుంచి తిరుగుబాటు ఎదురవుతుండడం, పార్టీ ఉనికి ప్రశ్నార్థకంగా మారడంతో ఈ విలీనానికి మమత కూడా సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. కాంగ్రెస్ లోక్‌సభ ఎంపీ ఇమ్రాన్ మసూద్ ఇరు పార్టీల విలీనానికి బహిరంగంగా పిలుపునిచ్చిన కొద్ది రోజులకే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం.





## జన నాయకుడు నరేంద్ర మోదీ

### దీర్ఘకాలిక ప్రధానిగా రికార్డ్

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ

**వరంగల్, ఆయుధం;** జననాయకుడు నరేంద్ర మోదీ దీర్ఘకాలిక ప్రధానిగా రికార్డు సృష్టించారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా. వన్నాల వెంకట రమణ పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ 4399 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా వరంగల్ కరీమాబాద్ లోని 40వ డివిజన్ లో ప్రత్యేక పూజలు నిర్వహించి, నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం పండ్లు పంపిణీ కార్యమానికి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకట రమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిద్ధం నరేష్, మాజీ కార్పొరేటర్, సీనియర్ నాయకులు కుసుమ సతీష్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా డాక్టర్ వన్నాల వెంకట రమణ మాట్లాడుతూ.. 4,399 రోజులు జూన్ 10వ తేదీ నాటికి నరేంద్ర మోదీ భారత దేశంలో అత్యధిక రోజులు పూర్తి చేసుకున్న ప్రధానిగా, నెహ్రూ రికార్డును బద్దలు కొట్టి, భారత దేశ ప్రజల అభిమానంతో 141 కోట్ల భారతీయ ప్రజల మద్దతుతో గ్రామీణ, పట్టణ, రోడ్, రవాణా, రైల్వే, దేశ భద్రత అన్ని రంగాలలో ఏ మాత్రం తక్కువ కాకుండా భారత దేశాన్ని ప్రగతి పథంలో నిలిపిన గొప్ప ప్రధానిగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చరిత్రలో నిలిచారు.

దేశ రక్షణ, ప్రజల అవసరాల కోసం బీజేపీ సర్కార్ తీసుకుంటున్న సాహసోపేతమైన నిర్ణయాలు, వాటి ఫలితాలు యువతలో కొత్త ఆలోచనకు బీజాలు వేశాయన్నారు. ఆరు దశాబ్దాలకు పైగా కాంగ్రెస్ పాలనలో దేశం చుట్టూ లెక్కకుమించిన తలనొప్పులు, తీరని సమస్యలు ఉంటే చాక చక్యంగా అన్నిటిని కొలిక్కి తీసుకువచ్చిన ఘనత మోడీ కే దక్కుతుంది అని అన్నారు. పుష్కర కాలంగా దేశాన్ని వికసిత భరత్ వైపు పరుగులు పెట్టించడానికి మోదీ హయాంలోని బీజేపీ ప్రభుత్వం పనితీరును ప్రపంచ దేశాల ప్రశంసలు పొందుతుంది అని అన్నారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు మాచర్ల దీన్ దయాల్, ఆకుతోట రాజు, చిలివేరి రాజేందర్, మాచర్ల రవీందర్, చెన్నారావు, ఆవునూరు లింగమూర్తి, మందాటి సందీప్, సుధాకర్, తదితర బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## తగ్గిన బంగారం, వెండి ధరలు



**జాతీయం, ఆయుధం:**

దేశీయంగా బంగారం, వెండి ధరలు తగ్గుముఖం పట్టాయి. దేశ రాజధాని దిల్లీలో 10 గ్రాముల మేలిమి పసిడి ధర రూ.4300 క్షీణించి రూ.1.56 లక్షలకు (అన్ని పన్నులూ కలిపి) చేరింది. కిలో వెండి సైతం దాదాపు రూ.10వేలు తగ్గి రూ.2.45 లక్షలకు (అన్ని పన్నులూ కలిపి) పలుకుతోంది. క్రూడాయిల్ రేట్లు పెరగడం, అమెరికా డాలర్ బలోపేతం కావడం వల్ల డిమాండ్ తగ్గుముఖం పట్టడం కారణంగా ఈ లోహాల ధరలు క్షీణించాయి. అంతర్జాతీయ మార్కెట్ లో ఔన్సు బంగారం ధర రోజు వ్యవధిలో 90 డాలర్లు క్షీణించి 4168 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. వెండి ఔన్సు 2.24 శాతం క్షీణించి 63.87 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

అమెరికా ఇరాన్ మధ్య మరోసారి ఘర్షణలు ప్రారంభం కావడంతో క్రూడాయిల్ ధర మరోసారి 90 డాలర్ల ఎగువకు చేరింది. దీనికి తోడు అమెరికా డాలర్ బలోపేతం కావడంతో బంగారం ధరలు దిగి వచ్చాయని పీఎల్ వెల్త్ ప్రోడక్ట్ అండ్ ఫ్యామిలీ ఆఫీస్ ఇవెడ్ రాజ్‌కుమార్ సుబ్రమణియన్ పేర్కొన్నారు. ఇంధన ధరల పెరుగుదల వల్ల ద్రవ్యోల్బణం పెరుగుతుందన్న భయాలు, దీర్ఘకాలం అధిక వడ్డీ రేట్లు కొనసాగే అవకాశం ఉండడంతో వీటికి డిమాండ్ తగ్గి ధరలు తగ్గుముఖం పట్టడానికి ప్రధాన కారణమని చెప్పారు. అమెరికా బాండ్లపై రాబడులు పెరగడం, ద్రవ్యోల్బణ భయాలూ కారణమని లెమన్ మార్కెట్స్ డెస్క్ రీసెర్చ్ అనలిస్ట్ గౌరవ్ గార్గ్ పేర్కొన్నారు.

## దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

- జస్టిస్ బాలకృష్ణన్ కమిషన్‌కు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య విజ్ఞప్తి
- రాజ్యాంగంలోని షెడ్యూల్డ్ కాస్ట్స ఆర్డర్–1950 పేరా–3ను తొలగించాలని వినతి
- మత మార్పిడితో కుల వివక్ష తొలగిపోదని కమిషన్ దృష్టికి తీసుకెళ్లిన ఎంపీ
- వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య



**వరంగల్, ఆయుధం:** దళిత క్రైస్తవులకు షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) హోదా కల్పించేలా రాజ్యాంగంలోని కాన్స్టిట్యూషన్ (షెడ్యూల్డ్ కాస్ట్స్) ఆర్డర్, 1950లోని పేరా-3ను తొలగించాలని కోరుతూ వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య జస్టిస్ కె.జి. బాలకృష్ణన్ కమిషన్ చైర్‌పర్సన్‌ను ఢిల్లీలోని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సమగ్ర వినతిపత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, క్రైస్తవ మతాన్ని స్వీకరించినప్పటికీ షెడ్యూల్డ్ కులాల మూలాలు కలిగిన దళిత క్రైస్తవులు ఇప్పటికీ సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన వివక్షను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మత మార్పిడి జరిగినంత మాత్రాన కుల ఆధారిత వివక్ష, సామాజిక వెనుకబాటుతనం తొలగిపోలేదని, అందువల్ల కేవలం మతాన్ని ఆధారంగా చేసుకుని ఎస్సీ హోదాను నిరాకరించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని వివరించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 15, 16 మరియు 46లో పొందుపరిచిన సమానత్వం, సామాజిక న్యాయం, బలహీన వర్గాల సంక్షేమ లక్ష్యాలకు అనుగుణంగా దళిత క్రైస్తవులకు కూడా ఎస్సీ హోదా కల్పించాలని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య కోరారు. గతంలో సిక్కులు, బౌద్ధులకు షెడ్యూల్డ్ కులాల గుర్తింపును విస్తరించిన నేపథ్యంలో, అదే సూత్రాన్ని దళిత క్రైస్తవుల విషయంలో కూడా అమలు చేయాల్సిన అవసరం ఉందని సూచించారు.

అలాగే *జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమిషన్ (2007)*తో పాటు పలు కమిషన్లు చేసిన సిఫార్సులను ప్రస్తావిస్తూ, రాజ్యాంగంలోని పేరా-3ను తొలగించి దళిత క్రైస్తవులకు షెడ్యూల్డ్ కులాల హోదా కల్పించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కమిషన్ సిఫార్సు చేయాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో, ముఖ్యంగా వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలో సుమారు మూడు లక్షల మంది షెడ్యూల్డ్ కులాల మూలాలు కలిగిన క్రైస్తవులు ఉన్నారని, వారికి ఎస్సీ హోదా కల్పించడం ద్వారా విద్య, ఉద్యోగాలు, సంక్షేమ పథకాలు, రాజ్యాంగబద్ధమైన రక్షణలు అందుబాటులోకి వస్తాయని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు. సమానత్వం, లౌకికవాదం, సామాజిక న్యాయం అనే రాజ్యాంగ విలువలను బలోపేతం చేసే దిశగా ఈ అంశంపై సానుకూల సిఫార్సు చేయాలని జస్టిస్ బాలకృష్ణన్ కమిషన్‌ను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కోరారు.



## ధరలు తగ్గిస్తారా.. గద్దె దిగుతారా?

2 లో

- సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు
- పెరిగిన ధరలపై సిపిఐ హనుమకొండ కలెక్టరేట్ ముట్టడి

## టెండర్ విధానాన్ని రద్దు చేయాలి

- చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాడుదాం
- వరంగల్ లో 5 వ రోజు విజయవంతమైన నిరసన దీక్ష. సంఘీభావం తెలిపిన పలువురు నాయకులు




**వరంగల్, ఆయుధం:** రాష్ట్ర ప్రభుత్వం టెండర్ విధానాన్ని రద్దుచేసి టెస్కో ద్వారానే బెడ్ షీట్స్ కార్పెట్స్ ఖరీదు చేయాలని డిమాండ్ చేస్తూ వరంగల్ కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద నిర్వహిస్తున్న చేనేతల నిరసన దీక్షలు బుధవారం ఐదో రోజు జయప్రదంగా నిర్వహించబడ్డాయి. ఆప్కో మాజీ డైరెక్టర్ దేవులపల్లి సత్యనారాయణ మూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తాటి పాముల వెంకట్రాములు ప్రసంగిస్తూ అనేక హామీలతో అధికారంలోకి

## 4,399 రోజుల సుపరిపాలన

- ప్రజాస్వామ్య పాలనతో మోదీ సరికొత్త రికార్డు
- వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్



**వరంగల్, ఆయుధం:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారతదేశంలో అత్యధిక కాలం సేవలందించిన ఎన్నికైన ప్రధానమంత్రిగా చరిత్ర సృష్టించడం ప్రతి భారతీయుడికి గర్వకారణం అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ పేర్కొన్నారు. ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని, శివనగర్లో మండల అధ్యక్షులు మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో శ్రీ సీతారామచంద్ర స్వామి, అభయాంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మోదీ కి దీర్ఘాయుష్షు, సంపూర్ణ ఆరోగ్యం, మాతృభూమి సేవలో మరింత శక్తి కలగాలని ప్రార్థించినట్లు తెలిపారు. ''మోదీ నాయకత్వంలో దేశం సేవ, సుశాసన్, గరీబ్ కల్యాణ్, వికసిత్ భారత్ సంకల్పంతో ముందుకు సాగుతోంది. ఆయన ప్రజా జీవితంలోని ప్రతి రోజు మా భారతి సేవకు, 146 కోట్ల భారతీయుల సంక్షేమానికి అంకితమైంది. "2014 మే 26న దేశ ప్రధానిగా మొదటిసారి బాధ్యతలు చేపట్టిన నాటి నుండి, 2019, 2024 ఎన్నికల్లో వరుసగా మూడు సార్లు తిరుగులేని ప్రజాదరణతో మోదీ దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారు. గత పాలకుల వలె కాకుండా ఎలాంటి విరామం లేకుండా 4,399 రోజుల పాటు నిరంతరాయంగా ప్రజాస్వామ్యయుతంగా ప్రధానిగా ఈ ఘనత సాధించడం యావత్ దేశానికి గర్వకారణం. నెహ్రూ కాలంలో దేశ జనాభా 34 కోట్లు మాత్రమే ఉండగా, నేడు 146 కోట్లకు పైగా ఉన్న విభిన్న సవాళ్లతో కూడిన భారతదేశాన్ని ప్రధాని మోదీ ప్రపంచంలోనే ఐదవ అతిపెద్ద ఆర్థిక శక్తిగా నిలబెట్టారు. కార్యక్రమంలో బీజేపీ ఐటీ కన్వీనర్ ఆడెపు వెంకటేష్, జిల్లా నాయకులు బైరి శ్యాం సుందర్, సుంచు కేశవ్, అజయ్, శివనగర్ బీజేపీ నాయకులు మార్త ఉషారాణి, బండి సుజాత, పన్నీరు బిక్షపతి, మల్లారెడ్డి, పాల్గొన్నారు.

## విద్యతోనే అభివృద్ధి

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు





**హనుమకొండ, ఆయుధం:** విద్యతోనే మానవ జాతి అభివృద్ధి జరుగుతుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు అన్నారు. బుధవారం హన్మకొండ జిల్లా కేంద్రంలోని గోపాలపురం లో ప్రయాగ విద్యా పీట్ పబ్లిక్ స్కూల్ ప్రారంభానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరు అయి మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్, రోహిణి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి డాక్టర్ సుధాకర్ రెడ్డి, ఫైన్ గ్రూప్ ఆఫ్ స్కూల్ అధినేత కుమార్ యాదవ్, వరంగల్ ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ వేముల నాగరాజు, మాజీ కార్పొరేటర్ సన్నీల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రయాగ విద్యా పీట్ పబ్లిక్ స్కూల్ కరెస్పాండెంట్స్ మంకన ప్రవళిక, చెరుకు వేణు ప్రసాద్, హరి క్రిష్ణ రెడ్డి గోపాల్ పూర్ లో ఇట్టి పాఠశాల ప్రారంభించడం , నాణ్యమైన విద్య తో పాటు విద్యార్థులు ప్రతిభ వెలికి తీసే విధంగా పాఠశాల నడుస్తుందని అన్నారు. విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వం పెంపొందించి వారిలో మనోధైర్యం కలిగించే విధంగా పాఠశాల విద్యా బోధన ఉండాలని అన్నారు. అరూరి రమేష్ మాట్లాడుతూ.. మంచి అహ్లాద వాతావరణంలో చేపట్టిన పాఠశాల నిర్మాణం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుంది అన్నారు.







# దిష్టిబొమ్మల దహనం హేయమైన చర్య

◆ **బీజేపీ జిల్లా అధ్యక్షుల తీవ్ర ఆగ్రహం**




**వరంగల్, ఆయుధం:** తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ చట్టబద్ధంగా తిరస్కరణకు గురికావడాన్ని నిరసిస్తూ, కాంగ్రెస్ నాయకులు బీజేపీ నాయకుల దిష్టిబొమ్మను తగలబెట్టడం అత్యంత దుర్మార్గమైన, హేయమైన చర్య అని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీకి రాజ్యాంగం పట్ల, దేశ చట్టాల పట్ల కనీస గౌరవం లేదని ఈ ఘటనతో మరోసారి రుజువైందని ఆయన మండిపడ్డారు. అఫిడవిట్ లో కోర్టు కేసుల వివరాలు, ఆస్తుల సమాచారాన్ని సమగ్రంగా పొందుపరచకుండా నిబంధనలను ఉల్లంఘించింది కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్. తప్పు మీ వైపు పెట్టుకుని, రిటర్నింగ్ అధికారి చట్టప్రకారం నామినేషన్ తిరస్కరిస్తే, దానికి ప్రధాని మోడీకి ఏం సంబంధం అని ప్రశ్నించారు. ఎన్నికల సంఘం (ECI) స్వతంత్రంగా, నిబంధనల ప్రకారం వ్యవహరిస్తుంది. దాన్ని అడ్డం పెట్టుకుని రాజకీయ లాభం పొందాలని చూడటం, విఫలమయ్యాక వీధుల్లోకి వచ్చి అరాచకాలు సృష్టించడం కాంగ్రెస్ మార్కు దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం. మూడోసారి ప్రధానిగా దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న నరేంద్ర మోడీ పై ఉన్న రాజకీయ కక్షతోనే కాంగ్రెస్ నాయకులు ఈ దిష్టిబొమ్మల దహనానికి పాల్పడుతున్నారు. దీన్ని జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రజలు, బీజేపీ శ్రేణులు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారు. దేశ ప్రధాని దిష్టిబొమ్మను తగలబెట్టి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన కాంగ్రెస్ నాయకులపై పోలీసులు తక్షణమే సుమోటోగా కేసులు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలని జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ డిమాండ్ చేశారు. తప్పులు చేయడం, దొరికిపోయాక ఇతరులపై ఏడవడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని, వరంగల్ జిల్లా ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ అరాచకాలకు ప్రజలే బుద్ధి చెబుతారని రవికుమార్ హెచ్చరించారు.

# ప్రజల భాగస్వామ్యంతో రోడ్డు ప్రమాదాల నియంత్రణ సాధ్యం

◆ **ఆపరేషన్స్ డీజీపీ అనిల్ కుమార్**




**హనుమకొండ, ఆయుధం:** ప్రజల భాగస్వామ్యం, సహకారంతోనే రోడ్డు ప్రమాదాలను నియంత్రించగలమని ఆపరేషన్స్ డీజీపీ అనిల్ కుమార్ తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యచరణలో భాగం వరంగల్ కమిషనరేట్ పోలీసుల ఆధ్వర్యంలో జనగామ జిల్లా కేంద్రంలోని మాంగళ్య కల్యాణ వేదికలో అరైవ్ అలైవ్ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిధి ఆపరేషన్స్ డీజీపీ అనిల్ కుమార్, వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ... దేశ వ్యాప్తంగా గతం లో 1లక్ష73 వేల మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని, దీని కారణంగా దేశ జీడీపీ 3శాతం నష్టం జరుగుతోందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో గత ఏడాది 7వేలకు పై ప్రజలు రోడ్డు ప్రమాదాల్లో మరణించారని చెప్పారు. ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయని, ఎన్ని భారీ ప్రమాదాలు జరిగిన ప్రజల్లో మార్పు రావడంలేదని అన్నారు విదేశాల్లో ట్రాఫిక్ రూల్స్ అతి కఠినంగా ఉంటాయని.. అక్కడ ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే వేలల్లో జరిమాలను విధించబడతాయని, కానీ మనదేశంలో మాత్రం ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే తక్కువగా జరిమానాలు విధించడం ద్వారా వాహనదారులకు భయం లేదని అన్నారు. మన దేశంలో రోడ్డు ప్రమాదాలకు ఇది కూడా ఒక కారణమని పేర్కొన్నారు. ట్రాఫిక్ రూల్స్ మీ భద్రత కోసమని, ప్రతి వాహన దారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ఎన్నో రోడ్డు ప్రమాదాలను నివారించగలమని తెలిపారు. అరైవ్ అలైవ్ ముఖ్య ఉద్దేశం వాహన దారుడు స్వీయ రక్ష పాటిస్తూ క్షేమంగా గమ్య స్థానాలకు చేరుకోవడమే పోలీసుల ప్రధాన లక్ష్యమని, గత ఆరు నెలలుగా చేపట్టిన అరైవ్ అలైవ్ కార్యక్రమం ద్వారా వరంగల్ కమిషనరేట్ పరిధిలో 15 శాతం రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయని, ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యత భావిస్తూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని ప్రజల భాగస్వామ్యంరోడ్డు ప్రమాదలను నివారించగలమని డీజీపీ తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ మన రాష్ట్రం అలాగే రాష్ట్రంలో సంవత్సరంలో తొమ్మిది వందల హత్య జరుగుచుండగా, రోడ్డు ప్రమాదాల్లో మాత్రం ప్రతి సంవత్సరం సుమారు 8వేల మందికి పైగా మరణిస్తున్నారని ఇది ప్రతి ఒక్కరు ఆలోచించాల్సిన విషయమని, ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ వాహనం నడపటం ద్వారా ఈ సమస్య పరిష్కరించుకోగలమని తెలిపారు. అంతకు ముందుగా కార్యక్రమం జరిగే ఆవరణలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలు సంబంధించి ప్రమాదానికి గురైన వాహనాలను ప్రదర్శనకు ఉంచి ప్రమాదం జరిగిన తీరును అధికారులు డిజిపికి వివరించారు, ట్రాఫిక్ రూల్స్ అతి క్రమిస్తే జరిగే పరిణామాలపై జాగృతి కళాబృందం, ట్రాఫిక్ పోలీసులు అవగాహన సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం డ్రైవింగ్ ప్రతిభ కనబరిచిన పోలీస్, ఆర్టీసీ డ్రైవర్లకు డీజీపీ చేతుల మీదుగా ప్రశంస పత్రాలను అందజేయగా, యువతకు హెల్మెట్లు, ఆటో డ్రైవర్లకు కంటి అద్దాలను అందజేశారు. చివరగా ట్రాఫిక్ నిబందనలు పాటిస్తామని స్థానిక యువతతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిసిపిలు రాజమహేంద్ర నాయక్, అంకిత్ కుమార్, ధార కవిత, అదనపుడిసిపి ప్రభాకర్ రావు, ఏసీపీలు భీమ్ శర్మ, నర్సయ్య, సత్యనారాయణ తో పాటు వెస్ట్ జోన్, ట్రాఫిక్ కు చెందిన ఇన్స్ స్పెక్టర్లు, ఎస్.ఐ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## నాణ్యమైన ఉత్పత్తులు తయారు చేసి
# ఆదాయాన్ని పెంచుకోవాలి

◆ **ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో మహిళలు వ్యాపార అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి**
◆ **జీడబ్ల్యూఎంసీ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య**




**వరంగల్, ఆయుధం:** ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకుని మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా మరింత ముందుకు సాగాలని జీడబ్ల్యూఎంసీ డిప్యూటీ కమిషనర్ (అడ్మిన్) సమ్మయ్య అన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్‌పాయ్ ఆదేశాల మేరకు ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ పథకం లబ్ధిదారుల కోసం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్, మెప్మా ఆధ్వర్యంలో స్థానిక కౌన్సిల్ హాల్‌లో నాలుగు రోజుల పాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ ముగింపు కార్యక్రమంలో బుధవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆహార ఉత్పత్తుల తయారీ, ప్రాసెసింగ్, నిల్వ, నాణ్యత ప్రమాణాలు, పరిశుభ్రత, ప్యాకేజింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్ వంటి అంశాలపై మహిళలకు సమగ్ర అవగాహన కల్పించినట్లు తెలిపారు. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేస్తే మార్కెట్లో ప్రత్యేక గుర్తింపు సాధించవచ్చని సూచించారు. ఆహార ఉత్పత్తుల నిల్వ కాలాన్ని పెంచేందుకు అనుసరించాల్సిన సాంకేతిక విధానాలు, నాణ్యత నియంత్రణ ప్రమాణాలు, ఆహార భద్రతకు సంబంధించిన జాగ్రత్తలపై నిపుణులు శిక్షణ అందించినట్లు చెప్పారు. మహిళలు ఈ శిక్షణ ద్వారా పొందిన పరిజ్ఞానాన్ని ఆచరణలో పెట్టి తమ వ్యాపారాలను విస్తరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా కాశిబుగ్గ సర్కిల్‌కు చెందిన మహిళా సంఘాల సభ్యులకు రెండు రోజుల పాటు, కాజీపేట సర్కిల్‌కు చెందిన సభ్యులకు మరో రెండు రోజుల పాటు శిక్షణ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు ఉత్సాహంగా పాల్గొని వివిధ అంశాలపై సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ సంస్థ ప్రతినిధులు, కాజీపేట సర్కిల్ టీఎంసీ కె.వెంకట్ రెడ్డి, కమ్యూనిటీ ఆర్గనైజర్లు సునీల్ కుమార్, స్వాతి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి పనులు, ఇందిరమ్మ ఇండ్లలో వేగం పెంచాలి

◆ **వీవో భవనాల నిర్మాణాలు ప్రారంభించి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి**
◆ **గిరిజన ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ కల్పించాలి**
◆ **జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**



**ములుగు, ఆయుధం:** ఉపాధి హామీ పథకం పనుల్లో కూలీల భాగస్వామ్యాన్ని పెంచాలని, వీవో భవనాల నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులతో ఉపాధి హామీ పథకం, వీవో భవనాల నిర్మాణ పురోగతి, ఇందిరమ్మ ఇండ్లు, ప్లాంటేషన్, సామాజిక భద్రతా పెన్షన్లు, ఇందిరా మహిళా శక్తి కేంద్రం, పెట్రోల్ బంక్ ఏర్పాటు తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య గణనీయంగా పెంచి, ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వీవో భవనాల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి, యుద్ధ ప్రాతిపదికన నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేసేలా చూడాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు అవసరమైన సహకారం అందిస్తూ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, ప్రతి దశలో పురోగతి సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని చేపడుతున్న మొక్కల నాటే కార్యక్రమంలో నిర్దేశించిన లక్ష్యాలను తప్పనిసరిగా చేరుకోవాలని ఆదేశించారు. నాటిన మొక్కల సంరక్షణపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. జిల్లాలో అమలవుతున్న వివిధ కేటగిరీల సామాజిక భద్రతా పెన్షన్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజా దర్బార్ కార్యక్రమంలో అందిన పెన్షన్ దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి అర్హులైన వారి ప్రతిపాదనలను సిద్ధం చేయాలని సూచించారు. జిల్లా ఇందిరా మహిళా శక్తి కేంద్రం భవనం ప్రారంభోత్సవానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.
జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయనున్న పెట్రోల్ బంక్‌కు సంబంధించి అవసరమైన అన్ని అనుమతులు త్వరితగతిన పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తాడ్వాయి మండలం కొండపర్తి గ్రామంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మిర్చి-పసుపు ప్రాసెసింగ్ యూనిట్, ఇప్పపూల లడ్డు తయారీ యూనిట్ కార్యకలాపాలు, ఉత్పత్తుల క్రయవిక్రయాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గిరిజన మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు విస్తృత ప్రచారం కల్పించి, మార్కెట్ అవకాశాలు పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానిక ఉత్పత్తులకు బ్రాండింగ్, ప్యాకేజింగ్, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించి ఆదాయాన్ని పెంచే దిశగా కృషి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, డీఆర్‌డీఏ పిడి చంద్రశేఖర్, అదనపు పీడి శ్రీనివాస్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# డీఎంహెచ్వోను కలిసిన ఏఐటీయూసీ నేతలు

**హనుమకొండ, ఆయుధం:** హనుమకొండ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారిగా నియమితులైన డాక్టర్ ఎస్.దుర్గా రామ్ కుమార్ ను ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజ్ గౌడ్, జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటియుసి అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా మర్యాదపూర్వకంగా కలిశారు. బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ ఎం రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఆచంట అభిషేక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హనుమకొండ డీఎంఅండ్ హెచ్ ఓ డాక్టర్ ఎస్.దుర్గా రామ్ కుమార్ మాట్లాడుతూ.. ఉద్యోగులకు ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకు వస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

# ‘పెద్ది’ టికెట్ ధరల పెంపు

**హోంశాఖ ముఖ్య కార్యదర్శిపై కోర్టు ధిక్కరణ పిటిషన్**

**హైదరాబాద్, ఆయుధం:** తెలంగాణ హోంశాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయెల్‌పై కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. ‘పెద్ది’ టికెట్ ధరల పెంపునకు హోంశాఖ అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. 10 రోజులపాటు టికెట్ ధరలు పెంచుకునేలా ఈ నెల 2న హోంశాఖ ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో కోర్టు ఉత్తర్వులు ధిక్కరించి మెమో ఇచ్చారని దాఖలైన పిటిషన్‌పై బుధవారం హైకోర్టు విచారణ చేపట్టింది. హోంశాఖ జారీ చేసిన మెమో అక్రమమని స్పష్టం చేసింది. టికెట్ ధరల పెంపు విషయంలో జీవో 121ను అనుసరించాలని సూచించింది. హోంశాఖ నుంచి వివరాలు సేకరించడానికి సమయం కావాలని ప్రభుత్వం తరఫు న్యాయవాది కోర్టుకు విన్నవించారు. దీంతో తదుపరి విచారణను ఉన్నత న్యాయస్థానం ఈ నెల 15కి వాయిదా వేసింది.




# శ్రీమహాదేవస్వామి ఆలయంలో పూజలు

**రఘునాథపల్లి, ఆయుధం:** రఘునాథపల్లి మండల కేంద్రంలో గల శ్రీ మహాదేవ స్వామి ఆలయంలో బుధవారం చివరి అధికమాసం కావడంతో భక్తులతో కిటకిటలాడింది. మహిళలు ప్రత్యేక పూజలు చేసి, సంప్రదాయంగా 33 రకాల నైవేద్యాలను అమ్మవారికి సమర్పించారు. ఆలయ పూజారి పిండిప్రోలు శ్రీనివాస్ శర్మ స్వామివారికి నైవేద్యాలు సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ కూరెళ్ల పెద్ద ఉపేందర్ రేణుక దంపతులు మాట్లాడుతూ.. ప్రజలంతా ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని దేవుని కోరుకున్నారు. భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు, కుంకుమ అభిషేకాలు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వాసవి క్లబ్, వనిత క్లబ్ రఘునాథపల్లి స్టేషన్ వారి ఆధ్వర్యంలో అమ్మవారికి 33 రకాల వాయినాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో కూరెల్ల చిన్న ఉపేందర్, ఓరుగంటి శంకర్ లింగం, బచ్చు చిరంజీవి, లగిశెట్టి లింగయ్య, పజ్జూరి రాజు, కూరేళ్ల వినయ్ కుమార్, తుమ్మలపల్లి సోమేశ్వర్, మహిళా భక్తులు పాల్గొన్నారు.

# యోగా సాధనతో మానసిక ప్రశాంతత

◆ **హనుమకొండ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్**




**హనుమకొండ, ఆయుధం:** ప్రతి ఒక్కరూ యోగ సాధన చేయడం ద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందని ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు. హనుమకొండ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్ పేర్కొన్నారు. హన్మకొండ జిల్లా యోగ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం బుధవారం హన్మకొండ లో జరిగింది. ఈ జనరల్ బాడీ సమావేశానికి ముఖ్యఅతిథిగా పరిశీలకులుగా అజీజ్ ఖాన్ తోపాటు హనుమకొండ జిల్లా యువజన సంక్షేమ క్రీడా అధికారిక సంస్థ పరిశీలకులు నవీన్, తెలంగాణ యోగ అసోసియేషన్ రాష్ట్ర పరిశీలకులు బొలిశెట్టి కమలాకర్, ముఖ్య అతిథిగా హనుమకొండ జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి హాజరయ్యారు. వరంగల్ జిల్లా యోగ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పాకాల రవీందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వరంగల్ ఉమ్మడి జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్ మాట్లాడుతూ.. నేటి ఆధునిక కాలంలో ప్రతి ఒక్కరూ మానసిక ఒత్తిడికి గురవుతున్నారని.. మానసిక ఒత్తిడి దూరం చేసుకోవడానికి ప్రతి ఒక్కరూ యోగ సాధన చేయడం ద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందని అన్నారు. యోగ అసోసియేషన్ కి ఒలంపిక్ అసోసియేషన్ నుండి అన్ని విధాల సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. హనుమకొండ జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ యోగా పట్టణ ప్రాంతానికే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో కూడా ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. హనుమకొండ జిల్లా యువజన సంక్షేమ క్రీడా అధికారిక సంస్థ పరిశీలకులు నవీన్ మాట్లాడుతూ డివై ఏస్ఏ నుంచి అన్ని రకాల సూచనలు అందిస్తామని అన్నారు. తెలంగాణ యోగ అసోసియేషన్ రాష్ట్ర పరిశీలకులు బొలిశెట్టి కమలాకర్ మాట్లాడుతూ తెలంగాణ యోగ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణలోని అన్ని జిల్లాలలో యోగ పై అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు. అనంతరం హనుమకొండ జిల్లా నూతన జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**యోగా అసోసియేషన్ నూతన కమిటీ**



హనుమకొండ జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షులుగా బాల్నే శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా గుగులోతు కమల కిషన్, కోశాధికారిగా సూరం రాము,. ఉపాధ్యక్షులుగా పెరుమాండ్ల కిరణ్, కుండె కిరణ్, భైరబోయిన నిహారిక, సహాయ కార్యదర్శిగా గుగులోతు కిషన్, బండి మానస, కార్యవర్గ సభ్యులుగా బత్తిని స్పందన, కైలాష్, రామనాథంలు ఏకగ్రీవంగా ఎన్నికైనారు, ఈ సమావేశంలో లక్ష్మన్ ,వ్యాయామ ఉపాధ్యాయులు తీగల శ్రీనివాస్, పాషా వరంగల్ జిల్లా యోగ అసోసియేషన్ కొశాధికారి సాంబశివరావు, యోగా శిక్షకులు కొట రజిత, జ్యోతి, పాల్గొన్నారు.



# పీవోకేలో కూలిన పాకిస్థాన్ హెలికాప్టర్

**జాతీయం, ఆయుధం:** పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో పాక్ సైన్యానికి చెందిన ఓ హెలికాప్టర్ (MI17) కుప్పకూలింది. ఈ ఘటనలో సైనికులందరూ ప్రాణాలు కోల్పోయినట్లు అక్కడి మిలిటరీ వర్గాలు పేర్కొన్నాయి. అయితే, ఘటన సమయంలో అందులో ఎంత మంది ఉన్నారనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. సుమారు 21 మంది పాక్ సైనికులు చనిపోయినట్లు వార్తలు వస్తున్నాయి. ముజఫరాబాద్‌లో స్థానిక ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొన్ని రోజులుగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో అక్కడ పాక్ ఆర్మీ అదనపు బలగాలను మోహరిస్తోంది. ఇందులో భాగంగా పాక్ సైనికులతో ఉన్న హెలికాప్టర్ ముజఫరాబాద్ నుంచి బయలుదేరింది. టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కుప్పకూలింది. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న రెస్క్యూ సిబ్బంది బాధితులను సమీప ఆసుపత్రులకు తరలించారు. అయితే, వీరిలో ఎవరూ ప్రాణాలతో బయటపడలేదని పాక్ ఆర్మీ ప్రకటించింది. పీవోకేలో ఇటీవల జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ)పై నిషేధం విధించడంపై స్థానికంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో నిరసన చేస్తున్న పౌరులపై సైన్యం జరిపిన కాల్పుల్లో 30 మందికి పైగా ప్రాణాలు కోల్పోయినట్లు పాక్ ప్రభుత్వం వెల్లడించింది. అయితే, వాస్తవంగా ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉన్నట్లు సమాచారం.

# టెండర్ విధానాన్ని రద్దు చేయాలి

(మొదటి పేజీ తరువాయి..)




వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేనేత కార్మికులకు త్రిఫ్ట్ పథకం, చేనేతకు చేయూత సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు పరచడం లేదని, కూలీ 30% పెంచినట్టు ప్రకటించిన ఇంతవరకు అమలు చేయకపోవడంతో కార్మికులు అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సహకార సంఘాల నుండి వస్త్రాలను ఖరీదు చేసిన టెస్కో గత ఏడు మాసాలుగా పేమెంట్ చేయకపోవడం దారుణం అన్నారు. చేనేత వృత్తిని శాశ్వతంగా సమాధి చేసిందుకే టెండర్ విధానాన్ని తెచ్చిందని మండిపడ్డారు. కార్మికుల నిరసన ఉద్యమాలు చూసైనా ప్రభుత్వం తన వైఖరి మార్చుకొని చేనేత కార్మికులు నిరసన వస్త్రాలు తీసుకోవాలని కరిచారని లేకుంటే ఉద్యమం తీవ్ర రూపందాలిస్తే ప్రభుత్వ బాధ్యత అన్నారు. చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపులు వీర మోహన్ ప్రసంగిస్తూ చేనేత కార్మికుల న్యాయమైన పోరాటానికి సంఘీభావం ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం తాను ప్రకటించిన జీవోను తుంగతుర్తి టెండర్ విధానం ప్రవేశపెట్టడం అత్యంత దుర్మార్గమన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆకు ఆ తర్వాత డిస్కో సహకార సంఘాల ద్వారా జరిగిన చేనేత ఉత్పత్తులను సరిచేసి ప్రభుత్వ సంస్థలకు అందించేది అన్నారు. ఈనాటి ప్రభుత్వం చేనేతలకు ఉపాధి లేకుండా ద్రోహం చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చొరవ తీసుకుని తక్షణమే టెండర్ విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని కొనసాగించి చేనేత పరిశ్రమను ఆదుకోవాలన్నారు. ప్లీజ్ రాష్ట్రవ్యాప్తంగా చేనేతలంతా ఐక్యమై పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తదితరులు సంఘీభావం తెలుపుతూ ప్రసంగించారు కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

# ధరలు తగ్గిస్తారా.. గద్దె దిగుతారా?

◆ **సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు**
◆ **పెరిగిన ధరలపై సిపిఐ హనుమకొండ కలెక్టరేట్ ముట్టడి**



**హనుమకొండ, ఆయుధం:** ప్రజలకు భారంగా పరిణమించిన అధిక ధరలను తగ్గిస్తారా.. లేక గద్దె దిగుతారా.. అని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సిపిఐ రాష్ట్ర వ్యాప్తం పిలుపులో భాగంగా అధిక ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ బుధవారం హనుమకొండ కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. సిపిఐ హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తొలుత ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియం నుండి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ధర్నాకు ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇప్పటికే పెట్రోల్ డీజిల్ ధరలను భారీగా పెంచిన ప్రభుత్వం తాజాగా వంట గ్యాస్ ధరలను పెంచి పేదలపై భారం మోపిందని అన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలకు తోడు నిత్యావసర వస్తువుల ధరలు నింగినంటుతున్నా కేంద్రం నియంత్రించడంలో విఫలం అయిందని అన్నారు.నిత్యావసర సరుకుల ధరలు ఇలాగే కొనసాగితే పేదలు, సామాన్య, మధ్య తరగతి ప్రజలు జీవించలేని పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు.జాతీయస్థాయిలో యుద్ధ వాతావరణం వల్ల ముడి చమురు రేట్లు పెరిగాయని సాకు చూపిస్తూ నిత్యావసర వస్తువుల ధరలు పెంచితే పేదవాని జీవనం ఎలా కొనసాగాలని ప్రశ్నించారు. వంట గ్యాస్‌తో పాటు కమర్షియల్ గ్యాస్ ధరలు పెంచడం వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన చిన్న చిన్న వ్యాపారస్తులు ఉపాధి కోల్పోయి రోడ్డుమీద పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యవసర సరుకుల ధరలు ఇలాగే కొనసాగితే సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మంద సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, జిల్లా నాయకులు కర్రె లక్ష్మణ్, ఉట్కూరి రాములు, మునిగాల బిక్షపతి, ఏదునూరి వెంకట్రాజం, సంతోష్, రవి, జక్కు రాజు గౌడ్, వేల్పుల సారంగపాణి, నేదునూరి రాజమౌళి, బత్తిని సదానందం, మెట్టు శ్యామ్ సుందర్ రెడ్డి, రాసమల్ల దీనా, రామ రాజశేఖర్, శనిగరపు రాజ్ కుమార్, శంకర్ నాయక్, గుంటి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695